# నవీన



ఆకాశానికి జల్లెడ పట్టినట్టు వెన్నెల... కొండ శిఖరాల మీంచి రైలుపట్టాల వరకు మసక మసకగా కురుస్తుంది. పాత పరిచయాలేవో వున్నట్లు ఆత్మీయంగా చేతులూపుతున్నాయి చెట్లు. ఇపుడిపుడే మొదలవుతున్న వానా కాలపు చల్లటిగాలి... దూదిలా మెత్తగా తాకుతున్న కొత్త రుతువు స్పర్శ... హృదయాన్ని పులకింప చేస్తుంది. ఎన్నో వొడిదుడుకుల జీవితాల్ని నవమాంతరంగా మోసుకుంటూ వొకే వేగంతో సాగిపోతుంది రైలు. ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌వెంట్లో వాళ్ళిద్దరే వున్నారు. రుత్విక్, నవీన.

రుత్విక్ నిద్రపోతున్నాడు. ఎవరెలాంటివారయినా నిద్రపోతున్నపుడు నిజంగా అమాయకులయిపోతుంటారు. నవీన కిటికీ గుండా బయటికి చూస్తుంది. బయట చీకటి... లోవల చీకటి... ఆవెంలోలోపల చీకటి. అతనున్నా తెలీని వొంటరితనమేదో ఆమెని వుక్కిరిబిక్కిరి చేస్తోంది. "వొంటరి... వొంటరి కాని వారెవరు ...? అన్నిటికంటే ఎక్కువ వొంటరి మనిషి... వొంటరి తనాన్ని పోగొట్టుకుంటున్నామనే భ్రమలో కృతిమ చిర్నవ్వుల మధ్య ఏదో వొక 'తోడు' వెతుక్కుంటూ ...మనిషి" తనలోంచి తనే పారిపోయినంత వొంటరితనం ఆవహించి వొకింత కళ్ళు మూస్కుని వెనక్కివాలిందామె.

"నిద్ర వస్తే బావుండు... నిదుర రాదే...?" అలా అనుకోవటమెన్నోసారో గుర్తు లేదు. మనసులో పరుగెత్తే నదిలా ఆలోచనలు ఆ ప్రవాహంలో కొట్టుకు పోతూ నిద్ర.

ఆమె రుత్విక్ వైపు చూసింది. "ఏమిటీ ఇతనికీ నాకూ సంబంధం. ఎందుకు వచ్చాడీ వ్యక్తి నా జీవితం లోకి...? ఏమాశించి ...?" కొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుని కిటికీ అద్దాన్ని కొంచెం పైకెత్తి మళ్ళీ చూపులు బయటకు విసిరేసింది. ఇంతటి వొంటరి పొలాల మధ్య కూడా ఓ వింత పరిమళమేదో హృదయాన్ని దోచుకుంటుంది.

అన్నిటికీ మించి ఓ రకమైన అడవిపూలు ఆమెను పదే పదే ఆకర్షిస్తున్నాయి. ఆ పూల పేరేమిటోగాని అతనితో ప్రయాణించేటపుడు ఆమెకు తెల్సింది. అతనికి ఆ పూలంటే బాగా ఇష్టమని. వాటిని చూస్తూ ఎన్నో కబుర్లు చెప్పేవడాతను.

"నవీ .... ఈ పూలని చూడు. నా హృదయం ఈ పూలమధ్య ఎక్కడో చిక్కుపడిపోయిందోయ్. నాకిపుడు జీవితంలో రెండే రెండు కోర్కెలు మిగిలిపోయాయి. ఒకటి చక్కటి ఇల్లు కట్టుకోవడం రెండోది ఓ చిన్నపూల తోట పెంచటం.అందులో పేరు లేని ఈ అడవి పూలకు 'నవీన' అని పేరు పెట్టి పెం

## జావేద్

చుకోవటం." అతనితో మాట్లాడటం కంటే అతని మాటలు వినటమే ఆమెకు చాలా ఇష్టం. అతనికెంతో ఇష్టమైన పూలకు తన పేరా..."నవీనా... నవీనా... నవీనా..." నాలుగు వైపుల నుంచి తన పేరు పిలుస్తున్నట్టు అతని గొంతు... అతను పిలిచిన భ్రమ. చుట్టూ చూసిందామె. కంపార్ట్‌మెంట్లో లోతయిన వొంటరితనం.. నిద్రపోతూ రుత్విక్. "రుత్విక్...రుత్విక్" రెండు సార్లు పిలిచిందామె. గాఢ నిద్రలో వున్నాడతను. కదిలించి లేపాలనుకుని మళ్ళీ ఆ ప్రయత్నం. మానుకుంది. గడిచిన రోజులు జ్ఞాపకాలై గుచ్చుకుంటున్నాయి. రాబోయే రోజులు అనిశ్చితాన్ని సూచిస్తూ భయపెడ్తున్నాయి. 'ఈ రోజు'పై మమకారాన్ని పెంచుతున్నాడు రుత్విక్.

"ఇలా ఎన్నాళ్ళని ఏడుస్తూ కూర్చుంటావు...? అలా జరగాల్సి వుంది. జరిగిపోయింది దాన్నే తల్చుకుంటూ... మిగతా జీవితాన్ని చేదుగా మార్చుకోకు. ఓ కొత్త జీవితం కోసం నిన్ను నువ్వు పునర్జీవింప చేసుకోవాలి. నిన్నటిని రేపటిని నమ్ముకోవద్దు. 'ఈ రోజు'ని విషాదానికి అమ్ముకోవద్దు నిన్న ఒక జ్ఞాపకం. రేపు వొక స్వప్నం.

'ఇవాళ' ఒక్కటే వాస్తవం" రుత్విక్ మాటలు నవీనలో కొత్త ధైర్యాన్ని నూరిపోసేవి... అయినా గతం పీడకలలా వెంటాడుతూనే వుంది.....

** ** **

అన్ని సాయంకాలాల్లాంటిదే ఆ సాయంకాలం కూడా. అయితే నవీన జీవితంలో ఈ చేదు ఘట్టం వుండేది కాదు. భర్త చావు కబురుని మోసుకొచ్చిన ఆ సాయంత్రం ఆమె రక్త ప్రవాహాన్ని ఆపేసింది. ఆమె చూస్తూ చూస్తూనే కళ్ళ ముందంతా జరిగిపోతూనే వుంది. సజీవంగా వెళ్ళిన భర్త గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయి నిర్జీవంగా రావటం...లతల్లా పేనుకు పోయే ఆ చేతులు కట్టెల్లా బిగుసుకు పోయి వుండటం... గలగలా మాట్లాడే నోరు శాశ్వతంగా మూతబడి పోవటం... మిరుమిట్లు గొలిపే కళ్ళు నిర్జీవంగా, నిర్భావంగా తేలిపోయి వుండటం... కన్నీరెండిన కళ్ళతో చూస్తూ వుందామె. బయట గుమిగూడిన జనం ఏవేవో చెప్పుకోవటం వింటుందామె. వినలేకపోతుంది కూడా. వాళ్ళంతా శవయాత్ర పనిలో వున్నారు. " నీకు ఎవరూ లేరని అనుకోవద్దు... మేమంతా లేమూ...?! ధైర్యంగా వుండూ..." అంటూ ఎవరెవరో ఏవేవో అంటున్నారు.

" ఆమెను ఆర్థికంగా ఆదుకోవాలంటే నలుగురము నాలుగు చేతులేసి ఆర్థికంగా కొంత సాయం చేద్దాం" ఎవరో పెద్ద మనిషి అంటుండగా రుత్విక్ అడ్డుపడ్డాడు. " మీరు మీ పనులు కానివ్వండి. ఆమెను ఆమె భాగ్యానికి వదిలేయండి" రుత్విక్ మాటలకు అంత దుఃఖంలోనూ నవీన కొంత వూరట చెందింది. ఆమె భర్తకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరి ముందూ చేయి చాచటం ఇష్టముండేది కాదు. భర్త స్నేహితుడిగా స్వల్ప పరిచయమే వున్నా ... రుత్విక్ ఆ రోజు దేవుడిలా కన్పించాడు. అతనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుందామె.

** ** **

భర్త లేకపోవడం నీడ లేకపోవడమే అనే విషయాన్ని చాలా తొందరగా అనుభవంలోకి వచ్చిందామెకు. రుత్విక్ అపుడపుడు ఇంటికి వచ్చి పోతున్నాడు. అతనిలో ఓ మంచి స్నేహితుడిని చూడగలుగుతోంది ఆమె. కానీ... అతనెళ్ళిపోయాక అదే వొంటరితనం... అదే నిశ్శబ్దం... అదే భయం అనేకానేక రాత్రులు నిద్ర కరువయి పోయేది. తలుపు మీద ఎవరో తట్టిన శబ్దం వినిపించేది.

భర్త పోయాక ఇంటి వోనరులో చాలా మార్పు కన్పిస్తుంది. వెకిలిగా ప్రవర్తించటం మొదలెట్టాడతను. అతను గుర్తొస్తే భయంతో వొళ్ళు గగుర్పొడిచేదామెకు.

" చూడమ్మాయ్ చెరిగిన బొట్టు కోసం ఎంతకాలమని ఏడుస్తూ కూర్చుంటావు. ఆనందమయ జీవితాన్ని ఎందుకు వృథా చేస్కుంటావు - యవ్వనాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేయకు" అంటూ ఆమెకు దగ్గరవటానికి నానా ప్రయత్నాలు చేసేవాడు. అతని బాధలు భరించలేక ఇల్లు మారిందామె. కొత్త ఇల్లు కొంత రొటీన్‌కు దూరం చేసింది. రుత్విక్ వీలైనంత ఎక్కువగా వస్తూ ఆమె యోగక్షేమాలు కనుక్కుని వెళ్తుండేవాడు. కానీ... ఇలా ఎన్నాళ్ళు . ఆమె ఆలోచనలు రైలు వేగంతోపాటు తగ్గి మెల్లగా ఆగిపోయాయి.

** ** **

అతనికి మెలకువ వచ్చింది. దుప్పటి కొంచెం తొలగించి-

" ఏదేనా స్టేషనా..?" అడిగాడు.

" కాదు... ఏమీ కన్పించటం లేదు"

రుత్విక్ దుప్పటి ముసుగేసుకుంటూ- " ఎంతసేపలా ఏమీ కన్పించని చీకట్లోకి చూస్తూ కూర్చుంటావు? నిద్రపోవచ్చు కదా...? మనమింకా చాలా దూరం వెళ్ళాలి" అనేసి అటు తిరిగాడు.

" రుత్విక్... నాకు భయంగా వుంది"

అతను మళ్ళీ కొంచెం దుప్పటి తొలగించి ఆమె వైపు చూశాడు. అతని చూపులో ఆమె ఏ భావమూ చదవలేకపోయింది. తన పక్కన చోటు చూపిస్తూ

" ఇక్కడికొచ్చి పడుకో. భయమెందుకూ...? నేను లేనూ...?" అని మళ్ళీ దుప్పటిలో దూరిపోయాడు. రైలు కూతవేస్తూ కదిలింది. రైలింజన్ శబ్దం వింటూ రుత్విక్ 'పక్క'వైపు చూసింది నవీన.

' తన కోసం కొంత చోటు ... అతని 'పక్క'న'

ఆమె వొళ్ళు జలదరించింది. ఆమెలోని సంస్కారం మేల్కొన్నట్టయ్యింది. వచ్చేసే ముందు రుత్విక్‌తో జరిగిన సంభాషణ గుర్తొచ్చిందామెకు.

** ** **

" నవీనా! మనం కొంతకాలం ఎక్కడికైనా వేరే ప్రదేశానికి వెళదామా...? నీకు కూడా కొంచెం మానసిక ప్రశాంతత వుంటుంది."

" వుంటుందేమో కానీ..."

" ఊ... కానీ... సమాజం గురించి భయపడ్తున్నావా ? అస్సలు పట్టించుకోవద్దు. నీకు తోడు రాని సమాజానికి నువ్వు సమాధానం చెప్పాల్సిన అవసరం ఏముంది. గతంలో నువ్వెన్ని కష్టాలు పడ్డావు ...? ఎవరైనా ఎలా వున్నావు ...? అని అడిగి చూశారా...? నీ మానాన నిన్నొదిలి కట్టుకున్న వాడు కాటికి చేరాడు...ఎన్నాళ్ళు...? తిరిగిరాని మనిషి రూపాన్ని గుండెల్లో నింపుకుని పూజించుకుంటావు చెప్పు...?"

" నువ్వు చెప్పేది... తార్కికంగా బానే వుంటుంది రుత్విక్ ... కానీ... మనకో సాంప్రదాయం ..."

" అదిగో ఆ సాంప్రదాయాల కాకరకాయలే వద్దంటున్నాను. వాటిని నమ్ముకుంటూ మనల్ని పాతాళానికి తొక్కేస్తారు నవీనా..."

అతనితో అంతకంటే వాదించ లేకపోయిందామె. కానీ, ఏకాంతంలో ఆలోచిస్తే... ఆమెకర్థమయ్యిందొక్కటే. పాత ఇంటి వోనరు మాటలకు, రుత్విక్ మాటలకు మధ్య పెద్ద వ్యత్యాసం ఏమీలేదని.

**ఆడపిల్లగా పుట్టిన పాపానికి దేహాన్ని ప్రేమించేవాళ్ళే తప్ప, తన కోసం రెండు బొట్లు కన్నీళ్ళు కార్చేవాళ్ళు లేనందుకు తన మీద తనకే జాలేసిందామెకు. నాలుగు గోడల మధ్య ఒక ఒంటరి ఆడది వుంది అంటే నాలుగు రోడ్ల కూడలిలో దొరికిన విస్తరిలానే భావించే మగపురుగుల మధ్య... అందరి అపహాస్యాల మధ్య... అపనిందల మధ్య ... క్షణ క్షణం నరకం అనుభవించటమేనా ఆడజన్మ.**

**' కొన్నాళ్ళు గడపటానికి తాను పరాయి మగాడితో పరాయి ప్రదేశానికి ఎందుకు వెళ్తుంది. తన మనసు మార్చుకోవాలనుకుంటుందా..?**

ఆడపిల్లగా పుట్టిన పాపానికి దేహాన్ని ప్రేమించేవాళ్ళే తప్ప, తన కోసం రెండు బొట్లు కన్నీళ్ళు కార్చేవాళ్ళు లేనందుకు తన మీద తనకే జాలేసిందామెకు. నాలుగు గోడల మధ్య ఒక ఒంటరి ఆడది వుంది అంటే నాలుగు రోడ్ల కూడలిలో దొరికిన విస్తరిలానే భావించే మగపురుగుల మధ్య... అందరి అపహాస్యాల మధ్య... అపనిందల మధ్య ... క్షణ క్షణం నరకం అనుభవించటమేనా ఆడజన్మ.

' కొన్నాళ్ళు గడపటానికి తాను పరాయి మగాడితో పరాయి ప్రదేశానికి ఎందుకు వెళ్తుంది. తన మనసు మార్చుకోవాలనుకుంటుందా..? లేక...? రుత్విక్ ఇంత గాఢంగా ఎలా నిద్రపోగలుగుతున్నాడసలు. కంపార్ట్‌మెంట్ మొత్తంలో తామిద్దరమే వున్నామని తెలిసీ... తనకు నిద్రపట్టనంత ఘోష అనుభవిస్తున్న విషయం తెలిసి కూడా ...!

ఇంటికి వచ్చిన ప్రతీసారి తనని చూసినపుడు రుత్విక్ కళ్ళలో ఆ మెరుపెందుకు...? జీవితాంతం ఈ మెరుపు ఉంటుందా...? వెలిసి పోతుందా..? ఆలోచనలు ఆమెను పిచ్చిదాన్ని చేస్తున్నాయి. అతని వైపు వోసారి చూసిందామె. అతని లోంచి ఓ నీడ లేచి మెల్లగా ఆమెను ఆక్రమించుకుంటున్నట్టు అన్పించసాగింది. ఆమె వొక్క వుదుటున లేచి 'చైన్' లాగింది. రైలు మెల్లగా ఆగింది.

** ** **

రైలు వెళ్ళిపోయి ఎంతసేపయిందో...! తూర్పు దిక్కు మెల్లగా కుంకుమ రూపుదాలుస్తుంది. రాత్రి తాలూకు చీకటి శత్రువుల్నించి తమని తాము రక్షించుకున్న వుత్సాహంతో రెక్కలు టపటపలాడిస్తూ నింగికి ఎగుర్తున్నాయి పక్షులు. ఒక్కొక్క అడుగే స్థిరంగా వేస్తూ, వొంటరిగానే... తనకుతానుగానే నవయుగంలోకి నడిచొస్తూ... నవీన.